క్లుప్తంగా

కళాశాల నిర్మాణానికి విరాళం



ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు చెక్కు అందజేస్తున్న నాయకులు

షాద్‌నగర్: దాతల సహకారంతో పట్టణంలో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణానికి బుధవారం నాగార్జున హార్చరీస్ యాజమాన్యం రూ.1లక్ష విరాళం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు కొందుర్గు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి ద్వారా ఈ విరాళానికి సంబంధించిన చెక్కును ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు చెంది తిరుపతిరెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రహదారిపై హైమాస్ట్ లైట్ల ఏర్పాటు



హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

షాద్‌నగర్: పట్టణంలో పాత రహదారిపై హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేస్తున్నారు. పట్టణంలోని చౌరస్తా నుంచి సోలీపూర్ వైజంక్షన్ వరకు ఇటీవల రోడ్డు విస్తరణ పనులు చేపట్టి పూర్తిచేశారు. ఇందులో భాగంగానే రోడ్డు మధ్యలో లైట్లు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో త్వరలో పాత జాతీయ రహదారి విద్యుత్ వెలుగులతో నిండిపోనుంది.

అల్లూరి సీతారామరాజుకు ఘన నివాళి



అల్లూరి సీతారామరాజు విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కేశంపేట: అల్లూరి సీతారామరాజు 101వ వర్ధంతి వేడుకలను బుధవారం బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి శివాజీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నాయకులతో కలిసి ఆయన నివాళులర్పించారు. కార్యక్రమంలో రాములు, తిరుమణి మణకంఠ, శ్రీనివాస్, బాలస్వామి, పాలాది శ్రీనివాస్, ఆంజనేయులు, శివగౌడ్, చంద్రశేఖర్, రాజు, రవిచారి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

బీజేపీ యువ నాయకుడు వైభవ్‌రెడ్డి



విరాళం అందిస్తున్న డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డి

చేవెళ్ల: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని బీజేపీ యువ నాయకుడు డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న మల్లన్న స్వామి ఆలయ నిర్మాణానికి మల్గారి వైభవ్‌రెడ్డి రూ.5లక్షల విరాళం బుధవారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. పురాతన ఆలయాల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని సూచించారు. ఆలయాల నిర్మాణాలతో గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొంటుందన్నారు. ఈ సందర్భంగా దాతను ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేకంగా అభినందించి శాలువాతో సన్మానించారు. అనంతరం చేవెళ్లలో బీజేపీ మండల నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన మున్నూరు శ్రీకాంత్‌ను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు అనంత్‌రెడ్డి, నాయకులు ఇంద్రాసేనారెడ్డి, అభి, ప్రవీణ్‌రెడ్డి, జయసింహ, అశోక్, మచ్చేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

ఆమోదం సరే.. పరిష్కారమెప్పుడో?

కొందుర్గులో రెవెన్యూ అధికారుల పర్యటన

- భూ సమస్యలపై దరఖాస్తుల స్వీకరణ
- ఆమోదించి వదిలేస్తున్న వైనం
- అయోమయంలో రైతన్నలు



తంగెళ్లపల్లి రెవెన్యూ సదస్సులో రైతులతో వివరాలు తీసుకుంటున్న అధికారులు

రెవెన్యూ సదస్సులో దరఖాస్తులు ఇలా..

తేదీ	గ్రామం	వచ్చిన దరఖాస్తులు	ఆమోదం	తిరస్కరణ
5	మహదేవ్‌పూర్	10	8	2
	రేగడిచిల్కమర్రి	36	11	25
6	శ్రీరంగాపూర్	19	18	1
	ఉత్తరాసిపల్లి	13	11	2
7	తంగెళ్లపల్లి	15	15	-
	ముట్పూర్	13	12	1

కొందుర్గు: ధరణి పోర్టల్‌లో వివిధ కారణాలతో రైతుల భూ సంబంధిత వివరాల్లో తప్పులు దొర్లాయని, వాటిని సరిచేసి భూభారతి చట్టాన్ని అందుబాటులోకి తెస్తామని ప్రభుత్వం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోంది. ఈ చట్టం 2025 జనవరి 4న రూపకల్పన చేశారు. ఏప్రిల్ 14న అమలులోకి తీసుకొచ్చారు. అయితే రాష్ట్రంలో జూన్ 2 నుంచి పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇందుకోసం ప్రతీ గ్రామంలో సదస్సులు నిర్వహించి రైతుల ద్వారా భూ సమస్యలపై ఫిర్యాదులు సేకరించాలని నిర్ణయించింది. మొదటగా పైలట్ ప్రాజెక్టు క్రింద కొందుర్గు మండలాన్ని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఈ నెల 5 నుంచి మండలంలో రెవెన్యూ అధికారులు రెండు టీమ్‌లుగా గ్రామాల్లో పర్యటించి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. కానీ వాటికి పరిష్కారమెప్పుడోనని రైతన్నలు ఆందోళనకు గురవుతున్నారు. అన్నదాతలు అందించిన అర్జీలను అధికారులు పరిశీలించి వాటిని ఆమోదిస్తున్నారే తప్పా పరిష్కరించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తక్షణమే పరిష్కరించాలి



భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహించడం సంతోషకరమైన విషయమే. కానీ సమస్యలపై రైతులు ఇచ్చిన దరఖాస్తులను అధికారులు తీసుకోవడమే తప్పా పరిష్కరం చేయకపోవడం బాధాకరం. వచ్చిన అర్జీలను అక్కడే విచారణ జరిపి పరిష్కరించి, రైతులకు ప్రొసీడింగ్‌లు అందజేయాలి. వెంటనే ఆన్‌లైన్‌లో సరిచేయాలి.

–బుద్దుల జంగయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

దరఖాస్తులపై విచారణ జరుపుతున్నాం



సదస్సులో రైతులు ఇచ్చిన దరఖాస్తులను అక్కడే విచారణ జరుపుతున్నాం. నిజమని తేలితే ఆమోదిస్తున్నాం. ఆన్‌లైన్‌లో సరిచేయడానికి ప్రభుత్వం ఇంకా అవకాశం ఇవ్వలేదు. ఏడు రోజుల నోటీసు గడువు ముగిసిన అనంతరం సంబంధిత రైతులకు ప్రొసీడింగ్‌లు అందజేస్తాం.

–రమేశ్‌కుమార్, తహసీల్దార్, కొందుర్గు

ప్రజలకు అందుబాటులో ఉండాలి



రాజారత్నంను సన్మానిస్తున్న అధికారులు, నాయకులు

పీఏసీఎస్ చైర్మన్ గంద్ర జగదీశ్వర్‌గౌడ్

కేశంపేట: ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉంటూ ఉత్తమ సేవలు అందించి ప్రజల మన్ననలను పొందాలని పీఏసీఎస్ చైర్మన్ గంద్ర జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. షాద్‌నగర్ ఏడీఏ, మండల ప్రత్యేకాధికారి రాజారత్నంకు డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి లభించింది. పదోన్నతిలో భాగంగా ఆయన నారాయణపేట జిల్లా అగ్రికల్చర్ టెక్నాలజీ (ఆత్మ) పీడీగా వెళ్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ.. వ్యవసాయ అధికారిగా రైతులకు అందుబాటులో ఉండి సేవలను అందించాలని సూచించారు. ఉద్యోగులకు బదిలీలు సాధారంగా జరుగుతుంటాయని, అధికారులు ఎక్కడ ఉన్నా ప్రజల కోసం పని చేయాలన్నారు. అనంతరం రాజరాత్నంకు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అజాంఅలీ, ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, మండల వైద్యాధికారి డాక్టర్ నిఖిత, ఎంపీఓ కిష్టయ్య, ఏపీఓ అజీజ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు సురేష్‌రెడ్డి, మాజీ సర్పంచ్ తలసాని వెంకట్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడులు జగదీశ్వర్, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వాసవి కన్యకాపరమేశ్వరికి ప్రత్యేక పూజలు



అమ్మవారికి అభిషేకం చేస్తున్న సంఘం నాయకులు

చేవెళ్ల: మండల కేంద్రంలో వాసవి కన్యకాపరమేశ్వరి జయంతి సందర్భంగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం మండల కేంద్రంలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఉదయం నుంచే ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయం వద్ద గణపతి హోమం, అమ్మవారికి ఫలాభిషేకాలు, పంచామృత అభిషేకాలు, కుంకుమార్చన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు మల్లి పెద్ది వెంకటేశంగుప్తా, ఆలయ కమిటీ అధ్యక్షుడు కుంచం శివకుమార్‌గుప్తా, మహిళా అధ్యక్షురాలు సరిత, నాయకులు రఘు, ప్రభు, శ్రీను, కృష్ణసామ్రాట్, వీరేందర్, మధుసూదన్‌గుప్తా, కుంచం శ్రీను, నవీన్, సతీష్, నాగరాజు, దయానంద్, రాజు, నర్సింలు, భద్రసేన, ఇంద్రసేన, వేణు, శంకరయ్య, ప్రభు, ఆనంద్,విజయ్ పాల్గొన్నారు.

9న రంగనాయకస్వామి దేవాలయ భూముల వేలం

షాద్‌నగర్‌రూరల్: మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామ పంచాయితీ పరిధిలో ఉన్న రంగనాయకస్వామి దేవాలయానికి చెందిన భూములను కౌలుకు ఇచ్చేందుకు వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ శివకుమార్ తెలిపారు. దేవాలయ వ్యవసాయ భూములను 2025–26, 2026–27 సంవత్సరాలకు గాను కౌలుకు ఇచ్చేందుకు వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 9వ తేదీన ఉదయం 10గంటలకు దేవాలయ ప్రాంగణంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు, ఆసక్తి గలవారు రూ.5వేల డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

సెమినార్‌ను విజయవంతం చేయండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

చేవెళ్ల: సీపీఐ పార్టీ వంద సంవత్సరాల ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 10న చేవెళ్లలో మతసామరస్యం పౌరుల బాధ్యత అనే అంశంపై సెమినార్ నిర్వహిస్తున్నట్లు సీపీఐ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.రామస్వామి తెలిపారు. మున్సిపాలిటీలో బుధవారం వ్యవసాయ కార్మిక సంఘం బీకేఎంయూ ఆధ్వర్యంలో సెమినార్‌కు సంబంధించి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో రోజురోజుకు అసమానతలు పెరిగిపోయి కులపరమైన విభజనతో పాటు మతపరమైన విభజనలు తీసుకొచ్చి ఒకరిపై ఒకరు దాడులు చేసుకునే పరిస్థితి వచ్చిందన్నారు. దీనికి ప్రభుత్వాలే కారణమని మండిపడ్డారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమానికి సామాజిక ఉద్యమ నాయకుడు ఎస్ఎం ఖలీల్ ముఖ్య అతిథిగా వస్తున్నట్లు తెలిపారు. ఆయనతో పాటు సీపీఐ పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో నాయకులు అంజయ్య, సుధాకర్‌గౌడ్, కృష్ణ, సుభాన్‌రెడ్డి, శ్రీను తదితరులు ఉన్నారు.

పశువులకు గాలికుంటు టీకాలు



శంకర్‌పల్లి: పశువులకు టీకాలు ఇస్తున్న డా.శ్రావణి



షాబాద్: టీకాలు వేస్తున్న వైద్యసిబ్బంది

శంకర్‌పల్లి: పశువుల్లో సీజనల్‌గా వచ్చే వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించి, సకాలంలో వైద్యం అందించాలని మహారాజ్‌పేట్ పశువైద్యాధికారి శ్రావణి అన్నారు. బుధవారం మండలంలోని పిల్లిగుండ్ల, ప్రొద్దటూరు, కొండకల్‌తండా, మియాఖాన్‌గడ్డ గ్రామాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. మండలంలో టీకాల కార్యక్రమం దాదాపు 20రోజుల నుంచి నిరంతరాయంగా కొనసాగుతుందని, ఇంకా టీకాలు వేయించని రైతులు దగ్గరలోని పశువైద్యులను సంప్రదించాలని ఆమె సూచించారు.

అమ్డాపూర్‌లో..

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని అమ్డాపూర్ గ్రామంలో బుధవారం పశువైద్యాధికారి దేవిరెడ్డి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో రవి, పశువైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

షాబాద్: పశువులకు సీజనల్‌గా వచ్చే వ్యాధులపై పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని షాబాద్, రేగడిదోస్వాడ పశువైద్యాధికారులు స్రవంతి, చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని సీతారాంపూర్, వెంకమ్మగూడ గ్రామాల్లో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకిలించాలి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకిలించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆపరేషన్ సిందూర్ పేరుతో పాక్ ఉగ్రవాద స్థలాలపై ఇండియన్ ఆర్మీ చేపట్టిన ఆపరేషన్ విజయవంతం అయిన నేపథ్యంలో ఎమ్మెల్యే బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులు అమాయకులైన పర్యాటకులపై విచక్షణారహితంగా జరిపిన కాల్పుల్లో ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. ఇందుకు భారత ఆర్మీ ప్రతీకారం తీర్చుకుందన్నారు. పాక్ ఉగ్రవాద స్థలాలను టార్గెట్ చేసి మెరుపుదాడులు చేసిన తీరు హర్షణీయమన్నారు. ఇందుకు దేశం అంతా గర్విస్తుందని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్‌ను అందరూ సమర్థిస్తున్నారని, ఉగ్రవాదాన్ని అంతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఇందులో అందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

దేశ రక్షణలో సైనికుల పాత్ర వెలకట్టలేనిది

మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

షాద్‌నగర్: దేశ రక్షణలో సైనికుల పాత్ర వెలకట్టలేనిదని మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. ఆపరేషన్ సిందూర్ పేరుతో పాక్ భూభాగంపై మన బలగాలు విజయవంతంగా దాడులు నిర్వహించిన నేపథ్యంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పహల్గాం ఉగ్రదాడికి భారత్ ప్రతీకార దాడులు చేయడం సరైన చర్య అన్నారు. భద్రతా బలగాలు ఇచ్చితమైన దాడి చేశాయన్నారు. ఆపరేషన్ సిందూర్ పేరుతో ఉగ్రవాదుల నిర్మూలనే లక్ష్యంగా భారత సాయుధ దళాలు జరిపిన దాడులు చూస్తుంటే గర్వంగా ఉందన్నారు. పహల్గాం ఉగ్రదాడిలో ఎంతో మంది అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోడంతో దేశం మొత్తం కన్నీరు పెట్టిందన్నారు. ఉగ్ర స్థావరాల నిర్మూలనకు తమదైన శైలిలో సైనికులు దాడులకు పాల్పడటాన్ని చూసి దేశ ప్రజలు సంతోషిస్తున్నారన్నారు. దేశ రక్షణలో సైనికుల పాత్ర వెలకట్టలేనిదన్నారు. ఇక నుంచి ఉగ్రవాదం పూర్తిగా కనుమరుగు కావాలని ఆకాంక్షించారు.

ఆర్మీ మెరుపుదాడులు తలెత్తుకునేలా చేశాయి

బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటేశ్

షాద్‌నగర్‌రూరల్: పాక్ ఉగ్రవాద స్థావరాలపై భారత ఆర్మీ మెరుపుదాడులు అందరినీ తలెత్తుకునేలా చేశాయని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎంకనోళ్ల వెంకటేశ్ అన్నారు. ఉగ్రవాదుల స్థావరాలపై భారత సైన్యం దాడులు చేసిన సందర్భంగా బుధవారం వెంకటేశ్ ప్రకటన విడుదల చేశారు. జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు విచక్షణారహితంగా దాడులు చేయడం బాధాకరమన్నారు. ఆపరేషన్ సిందూర్ పేరుతో ఉగ్రవాదుల నిర్మూలనే లక్ష్యంగా సైనికులు జరిపిన దాడులు చూస్తుంటే గర్వంగా ఉందన్నారు. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తూ సహకరిస్తుంటే భారత్ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు.

ఎమ్మెల్యే సబితారెడ్డిని కలిసిన నాయకులు



సబితారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

చేవెళ్ల: మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితారెడ్డిని పట్టణ బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం ఉదయం ఆమె నివాసానికి వెళ్లిన నాయకులు మైనింగ్ కేసులో నిర్దోషిగా ప్రకటించటంపై హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. 15 ఏళ్ల నుంచి విచారణ చేసిన తర్వాత కడిగిన ముత్యంలా బయటపడటం సబితారెడ్డి నీతి నిజాయితీకి నిదర్శనమని డీసీఎంఎస్ మాజీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి అన్నారు. ఇది సబితారెడ్డి అభిమానులకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. ఆమెను కలిసిన వారిలో నాయకులు వెంకట్‌రెడ్డి, మాధవరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఘనంగా బొడ్రాయి ఉత్సవాలు

కొందుర్గు: మండల కేంద్రంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన చేసి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా గ్రామస్తులు వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా బొడ్రాయి బోనాలను కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు డప్పుచప్పుళ్ల మధ్య బోనాల ఊరేగింపుతో బొడ్రాయి వద్దకు చేరుకొని నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



బోనాల ఊరేగింపు

రాజీవ్ యువ వికాస్ దరఖాస్తుల పరిశీలన పూర్తి

- ఎంపీడీఓ వెంకయ్య
- బ్యాంకుల్లో ఆధార్, పాన్‌కార్డులను సమర్పించాలని సూచన



మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకయ్య

శంకర్‌పల్లి: రాజీవ్ యువ వికాసం కోసం దరఖాస్తు చేసుకున్నవారు సిబిల్ స్కోర్ చెకింగ్ కోసం సంబంధిత బ్యాంకుల్లో ఆధార్, పాన్‌కార్డులను సమర్పించాలని ఎంపీడీఓ వెంకయ్య సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేకాధికారి సురేశ్‌బాబుతో కలిసి ఆయన బ్యాంకు అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. రాజీవ్ యువ వికాస్‌కు సంబంధించి ఇప్పటికే దరఖాస్తుల పరిశీలన పూర్తిచేసి వారి వివరాలను సంబంధిత బ్యాంకులకు అందజేసినట్లు తెలిపారు. అదే విధంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలు ఆన్‌లైన్ ఎంట్రీ చేయడం పూర్తయిందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ప్రభుత్వ నియమ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని కోరారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను కార్యదర్శులకు వివరించి, పరిష్కరించుకోవాలని ప్రజలకు సూచించారు. సమావేశంలో ఎంపీఓ గిరిరాజు తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో దుక్కులతో భూసారం పెంపు

సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ మహదేవప్ప



అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త డాక్టర్ మహదేవప్ప

మొయినాబాద్‌రూరల్: వేసవిలో దుక్కులతో భూసారం పెరుగుతుందని రాజేంద్రనగర్ ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ సీనియర్ శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.జీ.మహదేవప్ప, జిల్లా వ్యవసాయ అధికారి నర్సింహారావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని నక్కలపల్లిలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి అనురాధ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహదేవప్ప, శాస్త్రవేత్త డాక్టర్ రమేశ్, జిల్లా వ్యవసాయ అధికారి పాల్గొని వారు మాట్లాడుతూ.. వేసవి దుక్కులతో వ్యవసాయ భూమి సారవంతంగా మారుతుందని తెలిపారు. భూమిని దున్నడంతో తొలకరి వర్షాలు పడగానే నీరు భూమిలోకి ఇంకి కోతకు గురికాకుండా ఉంటుందని, లోతు దుక్కులతో భూమి పైపొరలు కిందికి, కింది పొరలు పైకి తిరగబడి నేల సారవంతంగా మారుతుందన్నారు. వేసవి లోతు దుక్కులు దున్నే ముందు పశువుల పెంట, పోగు, కంపోస్టు ఎరువు, మట్టిని వెదజల్లడం ద్వారా భూమి సారవంతమై పంట దిగుబడి పెరుగుతుందని వివరించారు. అదేవిధంగా పంట మార్పిడి చేయడంతో లాభాలు పొందవచ్చని సూచించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు బీ.జే.సురేష్ మాట్లాడుతూ.. బయో ఫర్టిలైజర్స్ వాడకం, వాటి వినియోగాలపై అవగాహన కల్పించారు. రైతులు మార్కెట్‌లో విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు వాటికి సంబంధించిన రసీదులు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి అనురాధ సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు సునీల్‌కుమార్, యాదగిరి, రైతులు నీలకంఠం, అంజయ్యగౌడ్, నిరంజన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.